జుక్కల్ ఎస్ఐకి మెమోంటో

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ ఎస్ఐ మురళిని జిల్లా ఎస్పీ మెమోంటోతో సత్కరించారు. రోడ్డు ప్రమాదాల నివారించడంలో ఎస్ఐ చేసిన కృషికి గాను ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి.. జుక్కల్ ఎస్ఐని సన్మానించారు. ఎస్ఐకి స్థానిక పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



మెమోంటో అందుకుంటున్న ఎస్ఐ

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగలు కొనుగోలు చేస్తాం

- మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి

నవతెలంగాణ-బోధన్

యాసంగి సీజన్లో భాగంగా రైతులు పండించిన శనగ పంటలను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి చెప్పారు. ఆదివారం ఆయన నాందేడ్ జిల్లాలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ మహాసభకు వెళుతూ సాలూరా మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు.



వివరాలు మెయిన్‌లో..

న్యూట్రీషన్ కిట్టు..
పోషకాహారం పొందేట్టు

- గర్భిణులకు రెండు విడుతలుగా అందజేత
- రక్తహీనత తగ్గించి హిమోగ్లోబిన్ శాతం పెంచడమే లక్ష్యం
- సకాలంలో అందిస్తే మరింత మేలు

నవతెలంగాణ-భిక్కనూర్

రాష్ట్ర ప్రభుత్వం మాతా శిశు సంరక్షణకు పెద్దపీట వేస్తూ గర్భిణుల్లో రక్తహీనను తగ్గించి మాత, శిశుమరణాలను నివరించడమే లక్ష్యంగా కేసీఆర్ న్యూట్రీషన్ కిట్ల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా రక్తహీనతతో బాధపడుతున్న 9 జిల్లాలను గుర్తించగా.. అందులో కామారెడ్డి జిల్లా ఒకటి. గతేడాది డిసెంబర్‌లో కిట్ల పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. గర్భిణులకు రెండు సార్లు కిట్లు అందజేస్తున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా కిట్లు సకాలంలో గర్భిణులకు అందడం లేదు. మొదటి విడుత కిట్టు స్థానిక పీహెచ్‌సీల నుంచి సకాలంలో అందుతుండగా.. రెండో కిట్టు జిల్లా ఆస్పత్రిలో ఇస్తుండటంతో గర్భిణులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టెస్టు కోసం వెళ్లిన సందర్భంగా కిట్లు అందుబాటులోకి రాకపోవడంతో మళ్లీ రావాలని సూచిస్తుండటంతో తిరగలేక అవస్తలు పడుతున్నారు.

కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీకి గత సంవత్సరం డిసెంబర్ 21వ తేదీనా లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా రక్తహీనత తక్కువగా ఉన్న 9 జిల్లాలను ఎంపిక చేసి రక్తహీనతను తగ్గించేందుకు 9 జిల్లాలకు న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేసింది. అత్యధికంగా రక్తహీనత ప్రభావం ఉన్న ఆదిలాబాద్, భద్రాద్రి, కొత్తగూడెం, జయశంకర్, భూపాలపల్లి, జోగులాంబ గద్వాల్, కామారెడ్డి, కొమరం భీమ్, ఆసిఫాబాద్, ములుగు, నాగర్ కర్నూల్, వికారాబాద్ జిల్లాలలో రక్తహీనత ప్రభావం ఎక్కువగా ఉన్న కారణంగా ప్రోటీన్స్, మినరల్స్, విటమిన్స్ లను పోషకాహారం అందించి రక్తహీనత తగ్గించడం, హిమోగ్లోబిన్ శాతం పెంచడం న్యూట్రిషన్ కిట్ల లక్ష్యం. ఒక్కో కిట్టుకు 1,962 రూపాయలతో రూపొందించి ప్రభుత్వం పంపిణీ చేస్తుంది.

డిసెంబర్ నెలలో ప్రారంభించిన సమయంలో కామారెడ్డి జిల్లాలో జిల్లా వ్యాప్తంగా 1,620 న్యూట్రిషన్ కిట్లను పంపిణీ చేయగా, జనవరి నెలలో 1,456 న్యూట్రిషన్ కిట్లను గర్భిణీలకు పంపిణీ చేశారు. మొదటి విడత 14 నుండి 27 వారాల సమయంలో స్థానికంగా ఉండే పీహెచ్‌సిలో అందజేయగా, రెండో విడత 27 నుండి 34 వారాల మధ్యలో ఏరియా ఆసుపత్రిలో గర్భిణి స్త్రీలకు గైనకాలజిస్ట్, స్కానింగ్, బ్లడ్ చెకింగ్ చేసిన తర్వాత అందజేస్తున్నారు.



కిట్లు అందుకున్న గర్భిణులు(ఫైల్)

కిట్లతో పోషకాహారం

గర్భిణులకు రక్తహీనతను తగ్గించడానికి న్యూట్రిషన్ కిట్లలో కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూర, ఐరన్ సిరప్ మూడు బాటిల్స్, 500 గ్రాముల నెయ్యి, ఆల్ బెండజోల్ టాబ్లెట్, కప్పు, ప్లాస్టిక్ బాస్కెట్ వస్తువులు ఉంటాయి. గర్భిణీకి మొదటి సారి 14 నుండి 27 వారాల మధ్యలో జరిగే రెండో ఏఎన్సి చెక్ అప్ సమయంలో ఒకసారి, రెండవ సారి 27 నుండి 34 వారాల మధ్యలో చేసే 3వ ఏఎన్సీ చెక్ అప్ సమయంలో ఏరియా ఆసుపత్రిలో న్యూటిషన్ కిట్లను గర్భిణీ స్త్రీలకు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంల ద్వారా అందిస్తారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీలో ఆలస్యం...

మొదటి విడత పంపిణీ చేస్తున్న న్యూట్రిషన్ కిట్లు స్థానిక పీహెచ్సీలో సమయానికి అందుతున్నా, రెండవ విడత ఏరియా ఆసుపత్రిలో పంపిణీ చేసే కిట్లు మాత్రం సమయానికి అందడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 27 నుండి 34 వారాల మధ్యలో ఏరియా ఆసుపత్రికి గర్భిణీ స్త్రీలు వెళ్లిన సమయంలో అందుబాటులో ఉండకపోవడంతో మళ్లీ రావాలని సూచిస్తున్నారు. మళ్లీ వెళ్లినా.. కొన్ని కిట్లు మాత్రమే అందుబాటులో ఉంటుండటంతో వెనుదిరగాల్సి వస్తుంది.

కంప్యూటర్‌లో పేర్లు వచ్చిన వారికే పంపిణీ..

14-27, 27-34 వారాలు నిండిన తర్వాత కంప్యూటర్ లో పేర్లు వచ్చిన వారిని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు చెకింగ్ కోసం ఆసుపత్రికి రావాలని సమాచారం గర్భిణీలకు అందజేస్తారు. మొదటి విడత న్యూట్రిషన్ కిట్ల పంపిణీ స్థానిక పీహెచ్ సిలో పంపిణీ చేయడం బాగానే ఉన్నా, 27-34 వారాల గర్భిణీ స్త్రీలు ఒక్కో గర్భిణీ స్త్రీ కి ఒక్కరోజు వారాలు నిండుతాయి. కంప్యూటర్ లో పేర్లు వచ్చిన వారు ఆశవర్కర్లు, ఎఎన్ఎం ల సమాచారం మేరకు ఏరియా ఆసుపత్రికి పరీక్షల నిమిత్తం వెళ్తారు. గర్భిణీ స్త్రీలు వెళ్లిన సమయంలో ఒక్కొరోజు ఒక్కో విధంగా పరీక్షలకు వస్తుంటారు. ఒకరోజు తక్కువ, మరో రోజు ఎక్కువ మంది గర్భిణీ స్త్రీలు రావడం వలన రెండవ విడత అందజేసే న్యూట్రిషన్ కిట్లు అందరికీ అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.



న్యూట్రీషన్ కిట్లు ఖర్జూర, నెయ్యి, న్యూట్రీషన్ పౌడర్, సిరప్‌లు

రెండవసారి అందజేసే న్యూట్రిషన్ కిట్లు సమయానికి అందని కారణంగా ఏరియా ఆసుపత్రి వైద్యులు మరోసారి రమ్మని గర్భిణీ స్త్రీలకు తెలియజేస్తున్నారు. మరోసారి ఏరియా ఆసుపత్రికి వెళ్లిన అందుబాటులో ఉంటేనే మాత్రం అందజేయడం లేనిచో తిప్పి పంపిస్తున్నారు. గర్భిణీ స్త్రీల బంధువులు వెళ్లిన ఇవ్వడం లేదని, గర్భిణీ స్త్రీ వస్తేనే న్యూట్రిషన్ కిట్లను అందజేస్తామని వైద్యులు తెలుపుతున్నారు. రెండో కిట్టును సైతం స్థానిక పీహెచ్‌సీలోనే అందజేయాలని గర్భిణులు కోరుతున్నారు.

రెండు సార్లు వెళ్లినా కిట్లు అందలే

ఓ గర్భిణీ

కంప్యూటర్‌లో పేరు వచ్చింది.. చెకింగ్ కోసం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి వెళ్లి న్యూట్రిషన్ కిట్టు తీసుకోవాలని ఆశ వర్కర్ చెప్పడంతో వెళ్లా. కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి వెళితే స్కానింగ్ చేసిన తర్వాత న్యూట్రిషన్ కిట్లు అయిపోయాయని మళ్లీ రావాలని వైద్యులు సూచించారు. మరోసారి వెళ్లినా.. కొన్ని కిట్లే వచ్చాయి. ముందుకు వచ్చిన వారికే అందాయని చెప్పడంతో తిరిగి వచ్చేశా. కిట్లు సరిపడా సరఫరా చేస్తే సకాలంలో అందే అవకాశం ఉంది.



పాదయాత్ర వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

జీపీ కార్మికలకు
కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

- గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట్‌గౌడ్ పిలుపు
- పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

గ్రామపంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తలపెట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎస్ వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం కామారెడ్డిలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోస్టర్‌లు ఆవిష్కరంచారు.

అనంతరం గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వెంకట గౌడ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఫిబ్రవరి 12 నుండి జనగామ జిల్లా పాలకుర్తి నుండి మహా పాదయాత్ర ప్రారంభమై ఫిబ్రవరి 28వ తేదీన హైదరాబాదులో ముగుస్తుందని ఫిబ్రవరి 28వ తేదీన జరిగే గ్రామపంచాయతీ కార్మికుల బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కనీస వేతనం నెలకి 26,000 ఇవ్వాలని, జీవో నెంబర్ 60 ప్రకారం పారిశుద్ధ కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కారోబార్ లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని జీవో నెంబర్ 51 సవరించాలని, కార్మికులకు అందరికీ డబుల్ బెడ్రూం ఇల్లు, ఇళ్ల స్థలాలు దళిత బంధు పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బాల నర్సు, కార్యదర్శి సాయిలు ఉపాధ్యక్షులు రాజన్న, సహాయ కార్యదర్శి నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు సాయిలు, రాజయ్య, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-తాడ్వాయి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన ఘటన మండలంలోని కృష్ణాజివాడి సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం..

తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామానికి చెందిన వడ్ల లక్ష్మీపతి (50) బ్రహ్మాజీవాడి గ్రామంలో నిత్యం వడ్ల పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు. పనులు ముగించుకొని స్వగ్రామమైన కృష్ణాజివాడి గ్రామానికి తిరిగి వస్తుండగా.. గ్రామ శివారు ప్రాంతంలో చెరుకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు.

గుండె గు'బిల్'

- సాధార గృహ వినియోగదారునికి రూ.1.77 లక్షల కరెంట్ బిల్లు

నవతెలంగాణ-నందిపేట్

ప్రతినెలా 300 నుంచి 400 రూపాయలు వచ్చే కరెంట్ బిల్లు.. ఈ నెలలో అక్షరాల 1,77, 970 రూపాయలు రావడంతో ఆ కుటుంబీకులకు ఒక్కసారిగా గుండె జల్లుమంది. వివరాల్లోకి వెళ్తే.. నందిపేట్ మండల కేంద్రంలో నందివాడ కాలనీలో నివసిస్తున్న సైయిద్ యునుస్ తండ్రి అయిన సైయిద్ మహబూబ్ పేరు మీదా (సర్వీస్ నెంబర్ 50950-0395) 17 వేల 823 యూనిట్లు వాడుకున్నట్టువచ్చి బిల్లు ఒక్క లక్ష 77 వేల 970 రూపాయల రావడంతో ఆందోళనకు గురైయ్యారు. కూలినాలి చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న తమకు ఇంత పెద్ద మొత్తంలో బిల్లు రావడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రూ.1,77,970 వచ్చిన కరెంట్ బిల్లు

ఈ విషయమై ఏఈ జ్ఞానేశ్వర్‌ను నవతెలంగాణ వివరణ కోరగా.. బిల్లు తీసే మిషిన్‌లో సాంకేతిక సమస్య రావడంతో బిల్లు పెద్దమొత్తంలో వచ్చినట్టు తెలిపారు. సదరు బిల్లును తొలగించి మళ్లీ బిల్లు అందజేసినట్టు తెలిపారు.

కరెంట్ వైర్లతో తీగల మైత్రీ

- కరెంట్ స్తంభానికి అల్లుకున్న పొదలు

నవతెలంగాణ-రామారెడ్డి

విద్యుత్ స్తంభానికి తీగలు, పొదలు అల్లుకున్నా.. విద్యుత్ శాఖ అధికారులు పట్టించు కోవడం లేదని, దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం నెలకొంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. మండలం లోని మద్దికుంటలో విద్యుత్ స్తంభానికి పొదలు, తీగలు అల్లుకున్నాయి. దీంతో విద్యుత్ సబ్ స్టేషన్‌లో విద్యుత్ ట్రిప్పు కావటంతో మోటార్, మోటార్ పరికరాలు చెడిపోతున్నాయి.



కరెంట్ స్తంభానికి అల్లుకున్న తీగలు, పొదలు

యాసంగి పంటలకు నాణ్యమైన, తగినంత విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్తు అందించాలని రైతులు ఒక వైపు డిమాండ్ చేస్తున్నారు. అయినా స్తంభాల నిర్వహణ సరిగ్గా చేపట్టకపోవడంతో కరెంట్ సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. మండలంలోని మద్దికుంటలో విద్యుత్ స్తంభానికి పొదలు, తీగలు అల్లుకోవడం, వాటిని విద్యుత్ అధికారులు తొలగించకపోవడం, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని, పొదలకు, తీగలకు పశువులు, మనుషులు తగిలిన ప్రాణాపాయంగా ఉన్నది. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే విద్యుత్ అధికారులు వెంటనే స్పందించి తొలగించాలని, విద్యుత్ సరఫరా అవుతున్న తీగలను అప్పుడప్పుడు పరిశీలించి నాణ్యమైన విద్యుత్ అందించాలని రైతులు కోరుతున్నారు.

రెండో ఏఎన్‌ఎంలను
ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-కామారెడ్డి టౌన్

రెండో ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని మాజీ మంత్రి షబ్బీర్ అలీ డిమాండ్ చేశారు. వీరి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలని, అసెంబ్లీ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని ఏఐటీయూసీ అనుబంధ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీకి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాజీ మంత్రి స్పందిస్తూ అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్న వేళ ప్రతిపక్ష నేత బట్టి విక్రమార్కకు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్టు తెలిపారు.




వినతిపత్రం అందజేస్తున్న రెండో ఏఎన్ఎంలు

కరోనా సైతం లెక్కచేయకుండా కరోనాలో పనిచేసిన ఘనత ఏఎన్ఎం అని వీరి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, 16 జీవో వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని పని భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎంలు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు బాలరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ దశరథ్, నాయకులు బి రేణుక, బి అంజలి, ఎం సుమలత, ఏ యాదమ్మ, శ్యామల, మంజుల, సుకన్య, కవిత, అలేఖ్య, బాలమణి, సరోజ, సుజాత 60 మంది సెకండ్ ఏఎన్ఎం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రజక బంధు ఇవ్వాలి

నవతెలంగాణ-లింగంపేట్

జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఉన్నటువంటి రజకులకు ప్రభుత్వం వెంటనే రజక బంధు ఇవ్వాలని చాకలి ఎస్సీ సాధన సమితి జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాజయ్య డిమాండ్ చేశారు. ఆదివారం లింగంపేట మండల కేంద్రంలో మండల స్థాయి రజకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రజకులు అన్ని రంగాల్లో వెనుకంజలో ఉన్నారని రాజకీయంగా ఆర్థికంగా విద్యాపరంగా ముందుకు పోవాలన్నారు. హక్కుల సాధన కోసం కలిసి పోరాడాలన్నారు. రాష్ట్రంలో రజకులకు సంబంధించిన ఎమ్మెల్యే ఇప్పటివరకు లేరని రజకుల్లో రాజకీయ చైతన్యం రావాలన్నారు. రజకులకు రజక బంధువు పది లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లోని రజకులను అగ్రవర్ణాల వారు రోజురోజుకు అణగదొక్కుతున్నారని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో ఉన్నారని తెలంగాణలో ముఖ్యమంత్రి కేసీఆర్ రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరారు.



మాట్లాడుతున్న రాజయ్య

ప్రభుత్వం రజకులకు 250 యూనిట్లు విద్యుత్ ఫ్రీగా ఇచ్చినప్పటికిని విద్యుత్ బిల్లులు భరించలేకుండా ఉన్నామని, బిల్లుల్లో రాయితీ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సంగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఒంటరిపల్లి సాయిలు, సంజీవులు, అధికార ప్రతినిధి గంగారం, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎల్లయ్య, మేధావుల విభాగం నాయకులు శంకర్, లింగంపేట్ మండల సమన్వయకర్త సాయిలు, రజక కులస్తుల పాల్గొన్నారు.

నాందేడ్‌సభకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



జుక్కల్ నుంచి..



మద్నూర్ నుంచి

నవతెలంగాణ-జుక్కల్/మద్నూర్

మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ సభకు జుక్కల్, మద్నూర్ మండలాల్లోని పలు గ్రామాల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున తరలివెళ్లాయి. మహారాష్ట్రలోని పలు సరిహద్దు గ్రామాల ప్రజలను.. తమ గ్రామాలను తెలంగాణలో కలపాలని గతంలో సీఎం కేసీఆర్‌కు ఉత్తరాలు రాశారు. దీంతో స్థానిక నాయకులు.. మహారాష్ట్రలోని సరిహద్దు గ్రామాల ప్రజలను సైతం తమ వెంట తీసుకెళ్లారు. జుక్కల్ ప్రాంతం నుండి గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో, ముఖ్య నాయకులు తరలివెళ్లారు. జుక్కల్ మహమ్మదాబాద్ తాండా బీఆర్ఎస్ నాయకుడు జాదవ్ రాజు, సర్పంచ్ సాయులు, పెద్ద గుల్లా, జుక్కల్ కేంద్రం, ఇతర గ్రామాల నుండి వెళ్లారు. మద్నూర్ మండలం నుండి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.

రైతు రాజ్యం చేయాలే

- నాగళ్లే కాదు.. పెన్నులు పట్టి చట్టాలు చేయండి
- రైతు ఆత్మహత్యలకు బీజేపీ-కాంగ్రెస్‌లే ముద్దాయి
- మహారాష్ట్ర-తెలంగాణది 'రోటీ-భేటీ' సంబంధం
- మహారాష్ట్రలో గులాబీ జెండా ఎత్తండి
- నాందేడ్ సభలో సీఎం కేసీఆర్ ప్రసంగం

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

'ప్రతిసారి ఎన్నికల్లో నాయకులు గెలుస్తున్నారు. ప్రజలు ఓడుతున్నారు. ఇకపై ఎన్నికల్లో ప్రజలు, రైతులు గెలవాలి. నాగళ్లు పట్టిన రైతులు పెన్నులు పట్టి చట్టాలు చేయాలి. రైతు రాజ్యం వస్తేనే మన సమస్యలు పరిష్కారం అవుతాయి' అని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. 'అబ్‌కిబార్.. కిసాన్ సర్కార్' పేరిట మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో బీఆర్ఎస్ బహిరంగ సభ ఆదివారం జరిగింది. ఈ సభకు సీఎం కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.



వివరాలు మెయిన్‌లో..

నవతెలంగాణ
నిజామాబాద్
2
సోమవారం 06 ఫిబ్రవరి 2023

నాందేడ్ బీఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతం: కోటపాటి

నవతెలంగాణ-ఆర్మూర్

నాందేడ్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీలో పెద్ద ఎత్తున నాయకులు, ప్రజలు, రైతులు చేరికకోసం 'ప్రవేశ్ షేహక్' పేరుతో నిర్వహించిన బహిరంగ సభ విజయవంతం అయిందని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమం వేదిక అధ్యక్షులు కోటపాటి నరసింహనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, సర్పంచ్‌లు పెద్ద ఎత్తున చేరి అశేష ప్రజలు పాల్గొన్న బహిరంగ సభను విజయవంతం చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో దేశమంతా ఎదురుచూస్తుందనడానికి నాందేడ్ సభ నిదర్శనంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సభ విజయవంతానికి శనివారం నుండి స్థానికంగా తన సామాజిక వర్గం, నిజామాబాద్ నుండి నాందేడ్‌లో స్థిరపడిన మైనార్టీలను సమీకరించి తన వంతు పాత్ర పోషించారు.

కొలిప్యాక్‌లో అనంతగిరి లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవం

- పాల్గొన్న ఎంపీపీ, జడ్పీటీసీలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని కొలిప్యాక్ అనంతగిరి లక్ష్మీనరసింహ స్వామి రథోత్సవ కార్యక్రమానికి ఎంపీపీ విమల రాజు, జడ్పీటీసీ తనుజ శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎంపీపీ జడ్పిటిసిలు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంపీపీ కుంచాల విమల రాజు ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తనూజ శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ బుల్లెట్ అక్బర్ ఖాన్, జక్రాన్ పల్లి మాజీ ఎంపీటీసీ నర్సారెడ్డి, గ్రామాల నుంచి వచ్చిన భక్తులు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యర్థాల డంప్‌గా కాలువ కట్టలు

- కాలువలో, కట్టపై చికెన్,మటన్ సెంటర్ల వ్యర్థాలు
- ఫౌల్టీ ఫాం, ఫంక్షన్‌ల వ్యర్థాలు ఇక్కడే
- దుర్గంధంగా కాలువల కట్టలు
- కలుషితం అవుతున్న జలాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ గ్రామ శివారులోని కాకతీయ కాలువ, మండల కేంద్రమైన కమ్మర్‌పల్లి, నాగాపూర్ సమీపంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద కాలువ, కాలువ కట్టల పరిసరాలు చికెన్ సెంటర్లు, మటన్ సెంటర్లలోని వ్యర్థాలకు అడ్డాగా మారిపోయాయి. ఫలితంగా కాకతీయ, వరద కాలువ పరిసరాలు అంటేనే ఇది వరకు ఎంతో ముచ్చట పడే స్థానికులు అటు వెళ్లాలంటేనే అమ్మో ముక్కు మూసుకోవాల్సిందే అంటున్నారు. అంతే కాదు ఈ వ్యర్థాలను ఇక్కడ ప్రతి నిత్యం పారవేస్తుండడం వల్ల అనారోగ్య పరిస్థితులు తలెత్తే ప్రమాదముందన్న ఆందోళనా వ్యక్తం అవుతోంది. ఊరి బయటే కదా పారబోస్తున్నాము అంటూ తమ పని కానిస్తున్నారు చికెన్, మటన్ సెంటర్ల వ్యాపారులు. కానీ అది ఎంత నష్టమో అని అధికారులు ఆలోచించడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారి నుండి ఉప్లూర్,నాగాపూర్‌తో పాటు ఏర్గట్ల మండలానికి వెళ్ళే రహదారులు శ్రీరాం సాగర్ ప్రాజెక్టు వరద కాలువ మీదుగా వెళ్తాయి. వరద కాలువ, రహదారులు కలిసే చోట నుండి వరద కాలువకు ఇరువైపులా ఉన్న కట్టలపై మార్గాలు ఇటు 63వ నంబరు జాతీయ రహదారి వరకు, అటు జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం, మెట్‌పల్లి మండలాల వరకు వెళ్ళే వారి ద్విచక్ర వాహనాలతో, స్థానికంగా ఉన్న పంట పొలాలలకు వెళ్ళే రైతులతో సందడిగా ఉంటుంది. కాకతీయ కాలువల బ్రిడ్జి ఇరువైపుల కట్టల మీదుగా ఎడమవైపు నుండి వెంచిర్యాల్ బ్రిడ్జి మీదుగా 43వ నంబరు జాతీయ రహదారికి చేరుకోవచ్చు. కుడివైపు నుండి జగిత్యాల జిల్లా డబ్బా, వర్షకొండ ఇబ్రహీం పట్నం గ్రామాలకు వెళ్ళవచ్చు. ఇరువైపుల కట్టల మీదుగా పంట పొలాలకు వెళ్లే రైతులతో, ద్విచక్ర వాహనాలు, కార్లు, ట్రాక్టర్ల రాకపోకలతో నిత్యం సందడిగా ఉంటుంది. కాకతీయ కాలువ కట్టలు, వరద కాలువపై పోస్తున్న వ్యర్థాలతో కాలువల కట్టల వద్ద కంపు కొడుతోంది. కాలువల కట్టలపై చికెన్, మటన్ వ్యర్థాలు డంప్ చేస్తుండడంతో కుక్కలకు నిలయంగా మారిపోయాయి. మాంసపు వ్యర్థాల కోసం తిష్ట వేస్తున్న కుక్కల మందలు రాత్రి పూట బిటి రోడ్డు పైకి చేరుతుండడంతో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మామూలు కంటే వర్షాకాలంలో ఈ వ్యర్థాలు కుళ్ళిపోయి భరించరాని దుర్వాసన వెదజల్లుతోంది. చికెన్ సెంటర్ల నిర్వాహకులు వ్యర్థాలను కొందరు మాములుగా, మరికొందరు మూట గట్టి కాలువల్లో పారవేస్తున్నారు. చచ్చిపోయిన కోళ్ల, మేకల జంతు కళేభరాలను కాలువల కట్టపై, కాలువలో వదిలేస్తున్నారు. దీంతో చేపలు పట్టే మత్స్యకారులు అనారోగ్యం భారిన పడే అవకాశముంది. కాకతీయ కాలువ, వరద కాలువల నుండి



కాలువకట్టపై పారేసిన మాంసం వ్యర్థాలు



కాలువకట్టపై పారేసిన ఫంక్షన్ల వ్యర్థాలు

ఎవడ వైపు చెరువులకు, పంట పొలాలకు నీటి విడుదల తూములు ఉన్నాయి.కుళ్ళిన వ్యర్థాలు చెరువులకు, పంటల పోలాలకు చేరితే పంటలకు, ప్రజల ఆరోగ్యానికి ముప్పు ఉంటుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారుల గుండా వెళ్ళే రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ఫంక్షన్ల వ్యర్థాలు ఇక్కడికే......

కమ్మర్‌పల్లి, ఉప్లూర్, నాగాపూర్ గ్రామాల్లో ఏ ఇంట్లో ఫంక్షన్ జరిగిన వాటి వ్యర్థాలు కూడా కాలువల కట్టపైకే చేరుతున్నాయి. ఫంక్షన్‌లలో భోజనం చేసిన ఇస్తార్లు, గ్లాసులను, మిగిలిన ఆహార పదార్థలను కూడా సంచుల్లో, ఆటోల్లో తీసుకువచ్చి కాలువల కట్టలకు ఇరువైపుల పారబోస్తున్నారు. ప్రజలు సంచరించే పరిసరాలను, జలాన్ని బహిరంగగానే కలుషితం చేస్తున్నా తగు చర్యలు చేపట్టడం తమ పని కాదన్నట్లు అధికారులు వ్యవహరించడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. బహిరంగగా పరిసరాలను పాడుచేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీఆర్‌టీయూ మండల అధ్యక్షులుగా అభిమన్యు



నవతెలంగాణ-ఎడపల్లి

పీఆర్‌టీయూ మండల అధ్యక్షులుగా పసుల అభిమాన్యు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీఆర్‌టీయూ జిల్లా భవనంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోహన్ రెడ్డి వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో పసుల అభిమన్యును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలో అభిమాన్యు చేసిన సేవలకుగాను ఆయన్ను మండల అధ్యక్షులుగా నియామకం చేసినట్లు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులుగా డి. హనుమాన్లు, ఆర్మూర్, బోధన్ డివిజన్ల ఇన్చార్జిలుగా లక్ష్మణ్ పటేల్, అంచల శంకర్, ఎడపల్లి మండల అసోసియేట్ అధ్యక్షులుగా నరసింహారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శిగా శంకర్, కార్యవర్గ సభ్యులుగా గంగ కిషన్, అశోక్, హన్మండ్లును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

కేంద్ర హోంమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి రాజారాం హల్దే

నవతెలంగాణ-డిచ్‌పల్లి



స్వామిని దర్శించుకుంటున్న కేంద్ర హోంమంత్రి అదనపు వ్యక్తిగత కార్యదర్శి

మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి గ్రామంలోని అతి పురాతనమైన, అపురూప శిల్పకళానిలయం, చారిత్రక ప్రసిద్ధి చెందిన ఖిల్లా రామాలయం, శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయాల అభివృద్ధికి తమ వంతు సహాయ, సహకారం అందజేస్తామని కేంద్ర హెూంమంత్రి, అదనపు వ్యక్తిగత కార్యదర్శి రాజారాం హల్ది, ఆయన సతీమణి యూనివర్సల్ గ్రూప్ స్కూల్ చైర్మన్ పార్వతి పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలోని ఖిల్లా రామాలయంలోని శ్రీసీతారామ చంద్రస్వామి, శ్రీలక్ష్మీ నర్సింహస్వామి వారిని వారు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం పర్యాటక కేంద్రం గా అభివృద్ధి చెందేలా చేయడానికి గ్రామస్తులు 35 శాతం నిధులు కాంట్రిబ్యూట్ చేస్తే కేంద్రం నుంచి 65 శాతం నిధులు మంజూరయ్యే విధంగా చూస్తామని గ్రామస్తులకు హామీనిచ్చారు. వారి వెంట శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ ప్రధానార్చకులు రవికుమార్ వడియాల్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు ఉన్నారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసి, పార్టీ అధ్యక్షులు

నవతెలంగాణ-మోర్తాడ్

మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 25 మంది లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను ఆదివారం పంపిణీ చేశారు. 25మందికి 13 లక్షల మంజూరైనట్లు ఎంపీపీ శ్రీనివాస్ తెలిపారు. ఈ చెక్కులను ఎంపీపీ శ్రీనివాస్, జడ్పీటీసీ రవి, పార్టీ మండల అధ్యక్షుడు ఏలియా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ భూమన్న, చైర్మన్ అశోక్, ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మామిడిపల్లి మల్లన్న జాతర



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని మామిడిపల్లి యానం గుట్ట వద్ద ఆదివారం ముజేగే మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. ఈ జాతరకు అర్గుల్, బ్రాహ్మణపల్లి, తొర్లికొండ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సైతం హాజరై నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం గుడి చుట్టూ రథం తిరగడం చూపరాలను ఎంతో ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వీడిసి నాయకులు వెల్మల మహిపాల్, పర్స ప్రవీణ్, వర్మ కొండ గురవయ్య, వడ్ల జగన్, ఆరే తిరుపతి, మురళి గౌడ్, కత్రాజి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సుద్దులంలో పలుపోటీలు

- బహుమతుల ప్రదానం



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్‌ల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

సుద్దపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం ఏర్పడి నాలుగు ఏళ్ళు విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా డ్వాక్రా మహిళలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎంపిపి గద్దె భూమన్న, హాజరై మాట్లాడారు. నాలుగేళ్లుగా గ్రామ అభివృద్ధికి సర్పంచ్ పానుగంటి రూపా సతిష్ రెడ్డి పాలకవర్గంతో కలిసి కృషి చేశారని అన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి, రెండవ, మూడో బహుమతులను అందజేశారు. గ్రామ పంచాయతీలో దాదాపు 20 ఏళ్లుగా సేవలందించి వయోభారంతో వెళ్లిపోయిన గంగారం మీనయ్యకి పదివేల రూపాయలు పంచాయతీ నుండి ఆర్థిక సహాయం అందజేశారు. అంతకు ముందు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిటిసి ఎంబడి సంతోషం, ఉప సర్పంచ్ శుద్ధ గంగారాం, సొసైటీ వైస్ చైర్మన్ డైరెక్టర్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, పంచాయతీ కార్యదర్శి ,డ్వాక్రా మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.

డాడీస్ రోడ్డు యాప్‌ను ప్రారంభించిన ఎస్‌హెచ్‌వో



యాప్‌ను ప్రారంభిస్తున్న సీఐ

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా డాడీస్ రోడ్డు యాప్ చాలా ఉపయోగపడుతుందని స్టేషన్ హౌస్ ఆఫీసర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేశామని, అన్ని రకాల వాహన దారులు ఈ సేవలను ఉపయోగించుకోవాలని నిర్వాహకులు రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. వాహనాలు పార్కింగ్‌చేసి వెళ్ళే సమయంలో గానీ వాహనం ఏదైనా ప్రమాదానికి గురైన అత్యవసర సమయాల్లో రక్తం అవసరం ఉన్న ఈ యాప్ చాలా బాగా పనిచేస్తుందని చెప్పారు. ఈ యాప్ జీవిత కాలం ఉపయోగంలో ఉండేందుకు వాహన దారులు ఒకే ఒక్కసారి 599తో రిచార్జ్ చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అప్పల గణేష్, సుదర్శన్, రాజేష్, లక్ష్మణ్, భూమేష్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన దులగుట్ట జాతర మహోత్సవాలు

నవతెలంగాణ-ముప్కాల్



మండల కేంద్రంలోని దులగుట్ట ప్రాంతంలో గల శ్రీ శివశ్రీనివాస కళ్యాణ మహెూత్సవం, మల్లన్న జాతర కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. గ్రామస్తులు శ్రీ శివశ్రీనివాస కళ్యాణ మహెూత్సవం, బోనాలతో నైవేద్యం సమర్పించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. మండలంలోని వెంచిర్యాల గ్రామంలో శ్రీ బంగారు వెంకటేశ్వర స్వామి ఆలయంలో రథోత్సవం చేపట్టినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మహా అన్నదానం ఉంటుందన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు కంచు విజయ్, సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, ఆయా కుల సంఘాల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య వృత్తిలో అంతర్భాగమే సేవ చేయడం

- మెగా వైద్యశిబిరంలో డాక్టర్ బి మధు శేఖర్

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న వైద్యులు మధుశేఖర్

వైద్య వృత్తిలో అంతర్భాగమే సేవ చేయడమని, డివిజన్లోని ప్రజలకు తాను ఉన్నన్ని రోజులు వైద్య సేవలు అందిస్తానని చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బి. మధు శేఖర్ అన్నారు. పట్టణంలోని పెర్కిట్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు 22 సంవత్సరాలుగా చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. ఇప్పుడు 42వ ఉచిత సర్జికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మార్చి నెలలో మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళ డాక్టర్ల సహకారంతో వేసక్టమీ ఆపరేషన్లను నిర్వహించేందుకు శిబిరాన్ని ఏర్పాటు చేస్తామని అన్నారు. హెల్త్ క్యాంప్ ఇంచార్జ్ వైద్యులు ఆశ చంద్రశేఖర్ రెడ్డి, సిరి లింగారెడ్డి, వసంతకుమారి లు వ్యవహరించారు. వైద్యులు డాక్టర్ అమృత్ రాంరెడ్డి, రాకేష్ కుమార్, రాజు, నరేష్, ముత్యంరెడ్డి, అజీమ్, శిరీష, శ్రీలత, సుజాత తదితరులు పాల్గొని వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగరాజు, వైస్ చైర్మన్ షేక్ మున్న కౌన్సిలర్లు చాలా ప్రసాద్, జహీర్ హలీ, రూపాలి మురళి, చేయూత స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మానస గణేష్, విద్యాసాగర్, కలిగోట గంగాధర్, పోల సుధాకర్, జనార్ధన్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులకు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

ఘనంగా నరసింహుని కల్యాణం, అన్నదానం

నవతెలంగాణ-ధర్పల్లి



నరసింహుని కల్యాణంలో సర్పంచ్, వీడీసీ సభ్యులు

మండలంలోని దుబ్బాక గ్రామ శివారులో గుట్టపై కొలువు దీరిన శ్రీ నల్లగుట్ట నరసింహస్వామి ఆలయంలో ప్రతి యేటా రెండవ నెలలో వచ్చే పున్నమి రోజు నరసింహుని కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు గోషికొండ అశోక్ తెలిపారు. ఈసందర్భంగా గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నూకల రమేష్, గ్రామ సర్పంచ్ వెంకటేష్, ఉప సర్పంచ్ ప్రతాప్‌గౌడ్ మాట్లాడుతూ.. తమ పూర్వీకుల నుండి ఈనెలలో వచ్చే పౌర్ణమిరోజు స్వామి కల్యాణం, పల్లకి సేవ, అన్నదానం నిర్వహిస్తానమ,ఇ మూడు రోజులపాటు జాతర ఉత్సవాలు జరుపు కుంటామని అన్నారు. గ్రామస్తులు, గ్రామాభివృద్ధి సహకారంతో ఆలయ కమిటీ సంయుక్తంగా ఈకార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి దొర్ల వెంకన్న, సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి రాహుల్ గాంధీ సందేశాన్ని తీసుకెళ్లాలి

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగడతాం
- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగేష్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జిల్లాలోని ప్రతి ఇంటికీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సందేశాన్ని తీసుకెళ్లడానికే హాథ్ సే హాద్ జోడో యాత్రలు నిర్వహించనున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటిపల్లి నగేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని కేఎస్ఆర్ గార్డెన్స్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మేడారం లో జోడో యాత్రలు ప్రారంభిస్తారని తెలిపారు. రెండు నెలల పాటు ఈ పాదయాత్రలు కొనసాగుతున్నా యన్నారు. నిజామాబాద్ జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతి నిధులు జోడో యాత్రలను విజయ వంతం చేయాలని అన్నారు. ఇందులో భాగంగా ఇంటింటికి తిరిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని చైతన్యం చేస్తారని తెలిపారు. ఆనాడు వైఎస్సార్ పాదయాత్ర చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చినట్లే ఇప్పుడు రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ల పాదయాత్ర ల ద్వారా అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని నగేష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పొలసాని శ్రీనివాస్, రవి, శ్యాంసన్, వాసుబాబు, ఎంపీటీసీ సీహెచ్ నర్సయ్య, గంగారెడ్డి, పెద్దోల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఊరు పేరు మార్చాలి

గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని చందా మీయబాగ్ గ్రామపంచాయతీ పేరు మార్చాలని గ్రామసభ ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు సర్పంచ్ కిషన్ నాయక్ తెలిపారు. మండలంలోని చందమీయబాగ్ తాండ గ్రామపంచాయతీ పేరును శివాజీ తాండగా మార్చాలని గ్రామసభ, గ్రామ పంచాయతీ పాలకవర్గం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు గ్రామ సర్పంచ్ కిషన్ నాయక్ తెలిపారు. తీర్మానం కాపీని జిల్లా పంచాయతీ అధికారికి స్థానిక సంస్థల ఆదాపు కలెక్టర్, ఎంపీడీవో కార్యాలయానికి సమర్పించినట్లు కిషోర్ నాయక్ తెలిపారు.

విద్యార్థులను అభినందించిన డీఐఈవో



విద్యార్థులను అభినందిస్తున్న డీఐఈవో

నవతెలంగాణ-కోటగిరి

బోధన్ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన క్రీడాపోటీల్లో కోటగిరి మైనారిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు క్రికెట్, ఖో ఖో పోటీలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారని, వారిని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి అభినందించారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోబిన్ ఆదివారం తెలిపారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవ్ కుమార్, అధ్యాపకులు అభినందించారని మోబిన్ తెలిపారు. కళాశాలకు ద్వితీయ బహుమతి రావడం అభినందనీయమని రఘురాజ్ పేర్కొన్నారని తెలిపారు.

ఇండియన్ ఆర్మీకి ఎంపిక

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పద్మాజివాడి గ్రామానికి చెందిన మామిండ్ల భాను ఆర్మీకి ఎంపికైయ్యాడు. చిన్నతనం నుంచి దేశ సేవ చేయాలనే తపనతో కఠోరంగా శ్రమించి ఎంపికైటనుట్టు తెలిపారు. మధ్యతరగతి కుటుంబమైనా.. తల్లిదండ్రులు సవిత, లింగం ప్రోత్సాహం ఇచ్చినట్టు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో శిక్షణకు వెళ్లనున్నాడు. ఈ సందర్భంగా మామిండ్ల భాను ను గ్రామస్తులు అభినందించారు.


మామిండ్ల భాను

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ ప్రచార కార్యదర్శిగా నాగేంద్ర వర్మ నియామకం

నవతెలంగాణ-దోమకొండ

పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని మండల బీఆర్ఎస్ పార్టీ యూత్ ప్రచార కార్యదర్శిగా నియమితులైన పిన్నం నాగేంద్ర వర్మ అన్నారు. పార్టీ యూత్ ప్రచార కార్యదర్శిగా నాగేంద్రవర్మను నియమించినట్టు ఆదివారం బిఆరెఎస్ పార్టీ మండల అధ్యక్షులు మధుసూదన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విప్ ఆదేశాల మేరకు పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా చూస్తానని అన్నారు.



అదుపుతప్పి చెట్టును ఢీకొని వ్యక్తి మృతి

నవతెలంగాణ-బిచ్కుంద

మేస్త్రి పని ముగించుకొని తిరుగుప్రయాణం కాగా.. బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన బిచ్కుంద మండలంలోని ఖద్గం గ్రామ శివారులో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజాంసాగర్ మండలం ముక్దంపూర్ గ్రామానికి చెందిన తిమ్మానగర్ లింగం, మిద్దింటి రమేష్ డోంగ్లీ గ్రామంలో మేస్త్రి పని ముగించుకొని శనివారం రాత్రి తిరిగి వారి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్నారు. ఈ సమయంలో లింగం బైక్ నడుపుతుండగా ఖద్గాం గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ప్రమాదవశాత్తు బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో లింగం ఘటన స్థలంలోని మృతిచెందాడు. గాయాల పాలైన రమేష్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.


మృతిచెందిన ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

నవతెలంగాణ-సదాశివనగర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని జాతీయ రహదారిపై ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. కామారెడ్డి పట్టణంలో విద్యానగర్‌లో నివాసం ఉంటున్న జూలురి సుధాకర్ (47)ను కామారెడ్డి నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి వచ్చి వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కారు నిజామాబాద్‌కు చెందిన ఉప్పల్‌రేవంత్ ఢీకొట్టినట్టు పేర్కొన్నారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

శ్మశాన వాటికలో బోరు మోటర్ ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని గుర్జకుంట గ్రామంలో స్మశానవాటికలో బోరు మోటర్ ను ఎంపీపీ గాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ యాదగిరి, సర్పంచ్ కందడి మనోహర రమేష్ రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతో బోరు మోటర్ వేయించినట్టు తెలిపారు. గ్రామాల అభివృద్ధికి సహకరిస్తున్న గంప గోవర్ధన్ కు గ్రామస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, రైతుబంధు అధ్యక్షుడు రామచంద్రం, ఎంపిటిసి గజెల్లి మీనా దుర్గ బాబు నేత, ఉప సర్పంచ్ లక్ష్మీ నర్సింలు, గ్రామ శాఖ అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు రవీందర్ రెడ్డి, కవితా, సువర్ణ, మాజీ సర్పంచ్ భూపాల్, సాయిరెడ్డి, సంతోష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, పుట్ట నరేష్, సుధాకర్ రెడ్డి, మల్లారెడ్డి, వీడిసి అధ్యక్షుడు దుర్గారెడ్డి, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పేదప్రజల ఆర్యోగం కోసమే
మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ-కామారెడ్డి

పేద ప్రజల ఆరోగ్యం కోసమే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించినట్టు మాజీ మంత్రి షబ్బీర్ అలీ అన్నారు. ఆదివారం కామారెడ్డి పట్టణంలోని ఇస్లాంపూర కాలనీలో షబ్బీర్ అలీ ఫౌండేషన్, సహాయత ట్రస్ట్ ఇండో యుఎస్ ఆస్పత్రి సౌజన్యంతో అమెరికా ప్రసిద్ధ హైదరాబాద్‌కు చెందిన 30మంది వైద్య బృందంతో వైద్య శిబిరం నిర్వహించారు. షబ్బీర్ అలీ మాట్లాడుతూ సుమారు 1500 మందికి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన అన్ని పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేసినట్టు తెలిపారు. శాస్త్ర చికిత్స అవసరం ఉన్న వారిని హైదరాబాద్ తరలించి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి వారికి వారికి అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ఇట్టి కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్, అమెరికాకు చెందిన డాక్టర్.మంజూరుగౌరీ, అనీస్ ఒద్దిన్, ఇఫ్తాఖరుద్దీన్, వలి మొహమ్మద్, డాక్టర్ సీమ, డాక్టర్ రఫియా మతిన్, డాక్టర్ ఆశ, డాక్టర్ ముస్కాన్, డాక్టర్ సుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్లు, క్రికెట్ కిట్ల పంపిణీ

నవతెలంగాణ-భిక్కనూర్

కామారెడ్డి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ జన్మదిన సందర్భంగా భిక్కనూర్ బిఆర్ఎస్ మండల యువజన విభాగం ఆధ్వర్యంలో మండల యూత్ అధ్యక్షులు బుర్రి రంజిత్ వర్మ నిరుపేదలకు ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ యూత్ అధ్యక్షుడు కనకరాజు, నాయకులు ముదాం అరుణ్, ప్రేమ్ కుమార్, రేవంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గంప గోవర్ధన్ జన్మదిన సందర్భంగా మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామంలో ఎంపీటీసీ గజెల్లి మీనా దుర్గ బాబు నేత, గంప గోవర్ధన్ తనయుడు రాష్ట్ర బిఆర్ఎస్ యువ నాయకులు గంప శశాంక్ చేతుల మీదుగా సిద్ధ రామేశ్వర నగర్, ర్యాగట్లపల్లి, గుర్జకుంట యూత్ క్లబ్ లకు క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి పద్మ నాగభూషణం గౌడ్, సిద్ధ రామేశ్వర నగర్ సర్పంచ్ జనగామ శ్రీనివాస్, గుర్జకుంట సర్పంచ్ కందడి మనోహర రమేష్ రెడ్డి, ర్యాగట్లపల్లి సర్పంచ్ నాగన్నగారి అనసూయ, ఉప సర్పంచ్ లతా సుధాకర్, మండల బిఆర్ఎస్ యూత్ అధ్యక్షులు రంజిత్ వర్మ, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్, నాయకులు బోనాల శ్రీనివాస్, పుట్నాల శ్రీనివాస్, వార్డు సభ్యులు భూమలింగం, గుడాల అరుణ్, రాజంపేట ఎల్లేష్, భారతి, యూత్ అధ్యక్షులు దండు నవీన్, క్రికెట్ యూత్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సదాశినగర్

సదాశివనగర్ మండలంలోని వజ్జేపల్లి తండాలో జగదాంబ ఆలయం 27వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. మొదటి రోజు గ్రామంలో ఉన్న ఆలయంలో వేదపండితులు హెూమంతో మొదలుపెట్టారు. రెండవ రోజు స్వామి వారికి అభిషేకం, హెూమం, లక్షపుష్పార్చన, మహా మంగళ హారతి, ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మూడవ రోజు ఆదివారం శివపార్వతులకు కల్యాణంతో పాటు విగ్రహాల ఊరేగింపు చేసి వార్షికోత్సవనికి ముగింపు పలికారు. మూడు రోజుల సాగిన ఉత్సవాలకు భక్తులు ఎలాంటి ఇబ్బందులు రాకుండ తండా నాయకులు ఏర్పాట్లు చేశారు. ఆధ్యాత్మిక చింతనతో భక్తులకు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు గ్రామస్థులు పేర్కొన్నారు. వచ్చే సంవత్సరం వేడుకల్ని మరింత ఘనంగా జరుపుతామని తండా నాయకులు అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంగ్యనాయక్, వైస్ చైర్మన్ హరి, క్యాషియర్ శ్రీచంద్, సదర్ నాయక్ లచ్చిరాం, సర్పంచ్ అనిల్, ఉప సర్పంచ్ స్రవంతి దేవిషింగ్, గిరిజన నాయకులు శ్రీనివాస్ నాయక్, నాయకులు సర్దార్, చంద్రు, శంకర్, భోజ్యా భావుసింగ్, బలిరామ్, దశరథ్, గంగారాం, మోతీరం, బీమా, మోహన్, పూల్య, సరిచంద్, ధూమ, దేవి తదితరులు హాజరయ్యారు.

అవ్వ.. జర బువ్వ పెట్టవా

- ఇల్లు కాలి, కూలిపోవడంతో నిరాశ్రయురాలై రోడ్డునపడ్డ వృద్ధురాలు

నవతెలంగాణ-భిక్కనూర్

పొట్టకూటి కోసం కన్న ఊరు విడిచి వచ్చారు. కూలీనాలి చేసుకుంటూ తమ కాళ్లపై తాము బతికారు. భర్త చనిపోవడం.. తదనంతరం రేకుల షెడ్డు కాలిపోయి కూలిపోవడంతో నిరాశ్రయురాలైంది. వయసు మీద పడటంతో ఎవరూ లేకపోవడంతో అవ్వ జర బువ్వ ఉంటే పెట్టవా అంటూ గ్రామస్తులు పెట్టింది తింటూ కాలం వెళ్లదిస్తోందో వృద్ధురాలు. వివరాల్లోకి వెళ్తే.. సిద్ధిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లికి చెందిన బాలమణి కిష్టయ్య దంపతులు 20 సంవత్సరాల క్రితం భిక్కనూర్ మండలం రామేశ్వర్ పల్లి గ్రామానికి పొట్టకూటి కోసం వలస వచ్చారు. వీరి జీవించడానికి గ్రామస్తులు రేకుల షెడ్డు ను ఏర్పాటు చేశారు. 4 సంవత్సరాల క్రితం భర్త కిష్టయ్య అనారోగ్యం కారణంగా మరణించడంతో బాలామణి గ్రామంలో వ్యవసాయ కూలీ పనికి వెళ్తూ జీవించసాగేది. 2 నెలల క్రితం తను నివాసముంటున్న రేకుల షెడ్డు ప్రమాదవశాత్తు పూర్తిగా దగ్ధం కావడంతో వంట సామాగ్రి, బట్టలు పూర్తిగా కాలిపోయి, సుమారు 2 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించింది. తహసీల్దార్ కార్యాలయ అధికారులు వచ్చి పంచనామా నిర్వహించి బాధితులకు ప్రభుత్వం నుండి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినా నేటికీ ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం అందలేదు. ప్రమాదం జరిగిన నాటి నుండి గ్రామస్తులు పెట్టిన భోజనాన్ని తింటూ జీవిస్తుంది. ఇటీవల కాలంలో పక్షవాతం రావడంతో ఒకవైపు కాళ్ళ చేతులు పడిపోయాయి. గ్రామస్తులు పెడితే తింటుందే తప్పా.. తన పనులు తను చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతుంది. ఈ విషయాన్ని గ్రామస్తులు డిడబ్ల్యూఓ ఆఫీస్‌కి సమాచారం అందించడంతో సమాచారం అందుకున్న ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ వృద్ధురాలి వద్దకు చేరుకొని వివరాలు సేకరించి వెళ్లారే తప్పా వృద్ధురాలికి ఎలాంటి భోజన ఏర్పాటు, వసతి కల్పించడం కానీ చేయలేరు. విషయం తెలుసుకున్న 'నవతెలంగాణ' వృద్ధురాలు వద్దకు చేరుకొని సమాచారం సేకరించగా "నన్ను ఇంత బువ్వ పెట్టి ఆశ్రమంలో చేర్పించండి నాయన బాంచెన్ " అంటూ తమ గోడు వెళ్ళబుచ్చింది. ఇల్లు కాలిపోయిన తర్వాత తనకు నష్టపరిహారం అందుతుందని బ్యాంక్ అకౌంట్, ఆధార్ కార్డు తీసుకొని అధికారులు వెళ్లారని ఇప్పటివరకు ఒక్క రూపాయి అందలేదని తెలిపింది. అన్నీ ఉన్నప్పుడు అందరు ఉన్న పరిస్థితి బాలేని సమయంలో తన బంధువులు ఎవరు పట్టించుకోకపోవడంతో దొరికిన చోట తింటూ, చలికి స్థలం ఉన్నాచోట పడుకుంటూ జీవించడాన్ని చూస్తున్న గ్రామస్తులు చలించిపోతున్నారు. అధికారులు పట్టించుకొని వృద్ధురాలికి వసతి కల్పించాలని కాలనీ వాసులు కోరుకుంటున్నారు.


కాలిపోయిన ఇంటిని పరిశీలించి పంచనామ నిర్వహిస్తున్న అధికారులు(ఫైల్)


బాలమణి

వృద్ధాశ్రమంలో వసతి కల్పిస్తాము-ఎఫ్ఆర్ఒ నరేష్

వృద్ధురాలు బలమణి పరిస్థితి గమణించి వివరాలు సేకరించడం జరిగిందని, త్వరలోనే వృద్ధాశ్రమంలో చేర్పించడం జరుగుతుందని ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ నరేష్ తెలిపారు.

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- కాంగ్రెస్ నాయకురాలు జమున వెంకట్ రాథోడ్

నవతెలంగాణ-లింగంపేట్(నాగిరెడ్డిపేట్)

గిరిజన బిడ్డను ఆశీర్వదించి ఒక్కసారి అవకాశం ఇవ్వాలని అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ నాయకులు జమున వెంకట్ రాథోడ్ అన్నారు. నాగిరెడ్డిపేట్ మండలంలోని మెల్లకుంట తండా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం జమున రాథోడ్ డాక్టర్ వెంకట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె గిరిజనులను గ్రామస్తులు ఉద్దేశించి మాట్లాడుతూ గిరిజనులు రాజకీయంగా ఆర్థికంగా విద్యాపరంగా అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. గిరిజన ఆడబిడ్డనని గిరిజనులు ఓటు వేసిఒక్కసారి అవకాశం ఇవ్వాలని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రజారాజ్యం పార్టీ నుండి ఎమ్మెల్యేగా పోటీ చేశానని గిరిజనుల మద్దతు ఇచ్చారన్నారు. మంచి మెజార్టీ వచ్చిందన్నారు. నియోజకవర్గంలో 40 వేలకు పైగా గిరిజనులు ఓట్లు ఉన్నాయని గిరిజనులు అనుకుంటే మనమే గెలవచ్చన్నారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా కచ్చితంగా పోటీ చేస్తానని ఒక్కసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కేస్లీ వస్త్రం నాయక్ శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు, గ్రామ పెద్దలు బాల్య నాయక్,వజ్ర నాయక్,దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.


వైద్యశిబిరంలో మాట్లాడుతున్న జమున రాథోడ్

ఘనంగా రథోత్సవం

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని కల్వరాల్ గ్రామంలో ఆదివారం ఘనంగా రథోత్సవం నిర్వహించారు. గ్రామంలో శ్రీ కృష్ణ స్వామి ఆలయం నుంచి ప్రధాన వీధుల గుండా రథం ఊరేగింపు చేపట్టారు. రథానికి మహిళలు హారతులు పట్టి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ముదిరాజ్ కులస్తులలో రాజకీయ చైతన్యం రావాలని కామారెడ్డి జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు బట్టు విట్టల్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అన్ని రాజకీయ పార్టీలు ముదిరాజ్ లను కేవలం ఓటు బ్యాంకు గా చూస్తున్నాయని మండిపడ్డారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ముదిరాజ్ లు ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. ముదిరాజ్ లను వంచించే పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. త్వరలోనే నియోజకవర్గ కేంద్రం లో ముదిరాజ్ లతో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భిక్కనూర్ గ్రామ ముదిరాజ్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బట్టు విఠల్

శ్రీ సంత్ గురు రవిదాస్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణంలో శ్రీ సంత్ రవిదాస్ జయంతి వేడుకలను జిల్లా మోచీ సంఘం అధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోచీ సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డమీది సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీ సంత్ గురు రవిదాస్ చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గడ్డమీది యాదగిరి, సింది కారి రాజబాబు, ప్రధాన కార్యదర్శి సిందికారి స్వామి, కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి నరేష్, సిందికారి సురేష్, మమ్మారి రాజశేఖర్, గడ్డమీది భాను ప్రకాష్ పాల్గొన్నారు.

నిరుద్యోగ అభ్యర్థులకు.. 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అండ

- పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారికి మెటీరియల్ అందజేత


స్టడీ మెటీరియల్ అందజేస్తున్న శివకుమార్‌గౌడ్

నవతెలంగాణ-పిట్లం

వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుపేద అభ్యర్థులకు 'సేవ్ ది గర్ల్ చైల్డ్' అండగా నిలుస్తోంది. ఉచితంగా మెటీరియల్(పోటీ పరీక్షల పుస్తకాలు) అందజేస్తూ వారు ఉద్యోగాలు సాధించేలా కృషి చేస్తుంది. పిట్లం వాసి అయిన చంచల్‌గూడ సెంట్రల్ జైల్ ఎస్పీ నవాబ్ శివకుమార్‌గౌడ్ ఈ సంస్థను ప్రారంభించి ఆడపిల్లల సంరక్షపై కార్యక్రమాలు చేపడుతూనే.. నిరుద్యోగ నిరుపేద అభ్యర్థులకు తనవంతు సాయంగా నిలుస్తోంది. గ్రూప్ 1 , 2 , 4 అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలకు నాంది పలుకుతూ వేల మంది అభ్యర్థులకు పుస్తకాలు అందజేస్తుంది.

దాతలు ముందుకు వస్తే సేవలు మరింత మెరుగు :
చంచల్‌గూడా సెంట్రల్ జైల్ ఎస్‌పి నవాబ్ శివకుమార్ గౌడ్

సేవ్ ది గర్ల్ చైల్డ్ చిన్న సంస్థ. దీని ద్వారా ఇప్పటి వరకు 1000 మంది నిరుద్యోగ అభ్యర్థులకు స్టడీ బుక్స్ ఉచితంగా పంపిణీ చేశాము. గత 4 రోజుల నుండి ఏడు వేలకు పైగా మంది అభ్యర్థులు స్టడీ మెటీరియల్ కోసం వాట్సాప్‌లో మెసేజ్ చేశారు. ఇంకా మెసెజ్‌లు వస్తూనే ఉన్నాయి. సేవ్ ది గర్ల్ చైల్డ్ సంస్థ చాలా చిన్నదని, ఎవరైనా దాతలు ముందుకు వస్తే మరికొంతమంది నిరుద్యోగులకు స్టడీ మెటీరియల్ అందించడం సాధ్యమవుతుందన్నారు.



నాందేడ్ సభ సక్సెస్..

- సభకు భారీగా జన సమీకరణ
- బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్
- ఉమ్మడి జిల్లా నుంచి హాజరైన ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ, పలువురు ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-నిజామాబాద్/బోధన్

భారత రాష్ట్ర సమితి ఆవిర్భావం తర్వాత సీఎం కేసీఆర్ మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాలో నిర్వహించిన సభ సక్సెస్ అయింది. దీంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. ఆదివారం తొలిసారిగా నిర్వహించిన మహాసభకు మహారాష్ట్ర, తెలంగాణ నుంచి జనం అధిక సంఖ్యలో పాల్గొన్నారు. బోధన్ నియోజకవర్గం నుంచి కాకుండా జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల నుంచి ప్రజా ప్రతినిధులు, నాయకులు వాహనాలలో టీఆర్ఎస్ కార్యకర్తలను తరలించారు. అలాగే మహారాష్ట్ర దెగ్లూర్, బిలోలి సమీప మండలాల నుంచి మహారాష్ట్ర వాసులు బస్సులలో తరలి రావడం కనిపించింది. దాంతో నాందేడ్ పట్టణంలో వాహనాల రద్దీ కనిపించింది. పోలీసులు సభలోకి మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసి జనాన్ని అనుమతించారు. మూడు గంటలకు ప్రారంభమైన కేసీఆర్ ప్రసంగం నాలుగు గంటలకు ముగిసింది. గంట సేపు ప్రసంగం కొనసాగింది.

అంతకుముందు మహారాష్ట్రకు చెందిన సీనియర్ నాయకులు భారత రాష్ట్ర సమితిలో చేరడంతో సీఎం కేసీఆర్ వారికి కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించారు. సభలో ఉమ్మడి జిల్లా నుంచి ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్సీ కవిత, ఆకుల లలిత, ఎమ్మెల్యే షకీల్ పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.






నాందేడ్‌లో నిర్వహించిన సభలో మాట్లాడుతున్న కేసీఆర్.. హాజరైన ప్రజలు, కార్యకర్తలు


సభలో ఎమ్మెల్సీ కవిత, ఎంపీ బీబీపాటిల్


టీఆర్ఎస్‌లో చేరిన వారికి కండువా కప్పుతున్న కేసీఆర్

సెల్‌ఫోన్ షాప్‌లో దొంగల బీభత్సం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని వెంకటేశ్వర టాకీస్ సందులోగల శ్రీ హర్షిని సెల్ఫోన్ దుకాణంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. స్థానికుల వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం మున్సిపల్ సిబ్బంది రోడ్లను శుభ్రపరుస్తున్న సమయంలో శ్రీహర్షిని సెల్‌ఫోన్ దుకాణం షెటర్ ధ్వంసమైనట్లు గుర్తించి దుకాణం యజమానికి సమాచారం అందించారు.. యజమాని వచ్చి చూసేసరికి దుకాణం నుండి 8 సెల్ ఫోన్లు, పదివేల నగదు దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించినట్లు బాధిత వ్యక్తి తెలిపారు..

పీఎంపీల సమస్యల పరిష్కారానికి ముందుంటా

- **పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మోహన్**

నవతెలంగాణ-ఆర్మూర్

పీఎంపీల సమస్యల పరిష్కారంలో ఎప్పుడు ముందుంటామని పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పుల్కన్ మోహన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని టీచర్స్ కాలనీలోని పీఎంపి భవనంలో మండల పీఎంపీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జిల్లా అధ్యక్షులు మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా సాయిలు, ఉపాధ్యక్షులుగా రంజిత్, కార్యదర్శిగా శ్రీనివాస్ ట్రెజరర్ గా నరేందర్, జాయింట్ సెక్రెటరీగా నరేందర్, సంయుక్త కార్యదర్శిగా తిరుపతి, సలహాదారుడుగా హరిచరణ్‌ను ఎన్నుకున్నట్టు చెప్పారు. నూతన కార్యవర్గ సభ్యులను సన్మానించారు. ఏసమస్య వచ్చినా పరిష్కరించడానికి శాయ శక్తుల ప్రయత్నిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మండల పీఎంపీలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలి

- **ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్**
- **తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్**
- **రాష్ట్ర ప్రథమ మహాసభలు ప్రారంభం**
- **జక్రాన్‌పల్లి జీపీ వర్కర్స్ భారీ ప్రదర్శన**


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్


యూనియన్ జెండాను ఆవిష్కరించిన నాయకులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

గ్రామపంచాయతీ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలి ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభ మండల కేంద్రంలోని అరుంధతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం జీపి వర్కర్స్ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు దాసు జెండాను ఆవిష్కరించారు. హెచ్ఆర్ఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు గొర్రపాటి మాధవరావు మహాసభల్ని ప్రారంభించి మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను నిర్లక్ష్యం చేస్తున్నాయని అన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ అందరికీ ఆరోగ్యం అందించాలని తీర్మానం చేసి 20 సంవత్సరాలైనా ప్రజలు అనేక రోగాలతో బాధపడుతున్నారని ఆయన తెలిపారు. దీనికి పరిసరాల పరిశుభ్రత ప్రధానమని పేర్కొన్నదని, గ్రామీణ ప్రాంతంలో సఫాయి కార్మికుల శ్రమ వెలకట్టలేనిదని ఆయన అన్నారు. ఇప్పటికీ కార్మికుల క్రమబద్ధీకరణ, కనీస సౌకర్యాలు లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు.

కనీస వేతనాల చట్టాన్ని, సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. అనంతరం

ఐఎఫ్‌టీయూ రాష్ట్రఅధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో 36వేల మంది పంచాయతి కార్మికులు ఉన్నారని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చట్టాలను వర్తింపచేయాలని, ప్రమాదవశాత్తు మరణిస్తే 10వేల ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని, వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి పని కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే డ్రెస్సులు, గ్లౌజులు చెప్పులు ఇవ్వాలని, డబుల్ బెడ్ రూమ్ పథకంలో జీపీ కార్మికులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇండ్లను ఇవ్వాలని ఆయన కోరారు.

దేశంలో 44 కోట్ల మంది కార్మికులు ఉంటే కేవలం ఐదు కోట్ల మందికి మాత్రమే చట్టాలు అమలవుతున్నాయని అన్నారు. అనంతరం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య మాట్లాడుతూ రైతే రాజు రైతు లేనిదే రాజ్యం లేదంటూ మాటలు చెప్పి బిజెపి సర్కార్ రైతు వ్యతిరేక చట్టాలు తెచ్చిందని అన్నారు. వ్యవసాయ రంగాన్ని బడా పెట్టుబడిదారులకు అప్పచెప్పే కుట్ర మానుకోవాలని, ప్రజలపై ఏసీడి పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని వేయడం ఆపాలని రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో

ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు భీ భూమయ్య, తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి సూర్య శివాజీ, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ భద్రాది కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు జటంకి వెంకన్న, నిజామాబాద్ జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్, ఖమ్మం, పెద్దపల్లి మంచిర్యాల్, నిర్మల్, కామారెడ్డి, సూర్యపేట్ జిల్లాల నుండి ప్రతినిధులు పాల్గొన్నారు. అరుణోదయ, నిజామా బాద్ జన సాంస్కృతిక కళావేదిక కళాకారులు పాల్గొన్నారు.

లాన్ టెన్నిస్ కార్యవర్గ సమావేశం

- **జిల్లా అధ్యక్షునిగా అద్మల ప్రవీణ్ రెడ్డి**


ప్రవీణ్‌రెడ్డికి నియామక పత్రం అందజేస్తున్న అశోక్‌కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

జిల్లా లాన్ టెన్నిస్ కార్యవర్గ సమావేశం ఆదివారం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా నూతన అధ్యక్షులను ఎన్నుకున్నారు మిగతా కార్యవర్గాన్ని వారం రోజుల్లో ఎన్నుకుంటామని చెప్పారు. జిల్లా అధ్యక్షులుగా అద్మల ప్రవీణ్ రెడ్డిని ఎన్నుకున్నారు. ఎన్నికైనట్టు ధృవ పత్రాన్ని ప్రవీణ్ రెడ్డికి రాష్ట్ర లాన్ టెన్నిస్ కార్యదర్శి అశోక్ కుమార్ అందజేశారు. జిల్లా అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మండల స్థాయిలో టెన్నిస్ క్రీడలు అభివృద్ధి చేస్తామని. మండల స్థాయిలో టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేస్తామని, మండలంలో సీనియర్ క్రీడాకారులతో శిక్షణ ఇప్పిస్తామని, గతంలో ఉన్న కలెక్టర్ నారాయణ రెడ్డి గంగాస్థాన్‌లో స్టేడియం స్థలంలో టెన్నిస్ కోర్టుకు స్థలాన్ని ఇస్తామని చెప్పారని ప్రవీణ్ రెడ్డి వివరించారు. వచ్చే సంవత్సరం నిజామాబాద్ జిల్లాలో రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలను ఏర్పాటు చేస్తామని అన్నారు.

నాందేడ్ సభకు మండల నాయకులు



సభలో పాల్గొన్న ఎడపల్లి మండల నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు మహారాష్ట్రలోని నాందేడ్ లో మొదటిసారిగా ఏర్పాటుచేసిన బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు ఎడపల్లి మండలం నుండి ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లారు. బహిరంగ సభ విజయవంతం చేయడానికి ఆయన అహర్నిశలు కృషి చేశారని పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు తెలిపారు. సభకు వెళ్లిన వారిలో ఎడపల్లి ఎంపీపీ కే శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, ఆకుల మాధవి శ్రీనివాస్, సర్పంచులు బట్టు హన్మాండ్లు, విజయ్ కుమార్, సాయిలు, సావిత్రి రవీందర్ గౌడ్, పిస్కగంగా ప్రసాద్, పాల్ద భాస్కర్ రెడ్డి, సునీత రవికుమార్, ఎంపీటీసీలు వనజ నాగరాజు, షేక్ బాబా, మంగళ్‌పాడ్ బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు హుస్సేన్, సుంకర లక్ష్మణ్, విఠల్, దేగామ మహేష్, మధుకర్ గౌడ్. బురిగాడి పోశెట్టి, నేయ్యి సాయిలు, ఆయాగ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సీపీఐ పార్టీలో చేరిన యువకులు


పార్టీలో చేరినవారికి కండువాలు వేసిన నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో కోటగిరి గ్రామ యువకులు పార్టీలో ఆదివారం చేరారు. ఈ సందర్భంగా పార్టీ బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జ్ దుబాస్ రాములు, కోటగిరి మండల కార్యదర్శి విటల్ గౌడ్ పార్టీ కండువా కప్పి సభ్యత్వ కార్డులు అందజేశారు. సీపీఐ పార్టీ కార్మికుల కోసం, రైతుల కోసం, బడుగు బలహీన వర్గాల ప్రజానీకం కోసం పోరాటాలు నిర్వహించే ఉద్యమ చరిత్రగల పార్టీ అని విట్టల్ గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నిర్వహించిన చరిత్ర సిపిఐకి ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సిపిఐ అనేక ఉద్యమాలు నిర్వహించిందని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకు, ఉపాధి హామీ కార్మికులకు వెన్నంటి ఉండి ఉద్యమం నిర్వహిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలోనాయకులు నల్ల గంగాధర్, బుడాల రాములు, శరత్, పత్తి శంకర్, గఫర్, భీమ్ రాజ్, మోహన్, దుబాయ్ సాయిలు, సాయి కిరణ్, హనుమాండ్లు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ బాలసాహిత్య సమ్మేళనంలో 'చదువు' పుస్తకావిష్కరణ


చదువు సరళ వచన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు, తదితరులు

నవతెలంగాణ-ఏర్గట్ల/కంఠేశ్వర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్‌లో పదవతరగతి చదువుతున్న దేగల వైష్ణవి రాసిన "చదువు' సరళ వచన శతకాన్ని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, పద్మ భూషణ్ అవార్డు గ్రహీత శాంత బయోటెక్ ట్రస్ట్ అధ్యక్షులు వరప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్ లో జరిగిన తెలంగాణ బాల సాహిత్య సమ్మేళనంలో ఆదివారం ఆవిష్కరించారు. చదువు గురించి అద్భుతమైన రచన చేసిందని, అతి చిన్న వయసులోనే తెలుగు భాషపై మమకారం పెంచుకొని, ఇంత మంచి రచనలు చేసిందని ఆమెను పెద్దలందరు అభినందించినట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. విద్యార్థినిని ప్రోత్సహిస్తున్న తెలుగుపండితులు ప్రవీణ్ శర్మను కొనియాడినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ కవి అమ్మంగి వేణుగోపాల్, వేదకుమార్, రంగినేని మోహనరావు, మాడభూషి లలితాదేవి, గరిపెల్లి అశోక్, పత్తిపాక మోహన్ పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : నిజామాబాద్ జిల్లా ప్రముఖ కవి, రచయిత, బాలసాహితీవేత్త డా.కాసర్ల నరేశ్ రావు రచించిన బాలల నాటికల సంపుటి జై విజ్ఞాన్ హైదరాబాద్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తులో ఆవిష్కరించారు. తెలంగాణ బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన శాంతా బయోటిక్స్ అధినేత, పద్మభూషణ్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్ ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. బాలల కోసం పెద్దలు రాయడం గొప్పకృషి అని, పిల్లలకు ప్రదర్శనయోగ్యమైన నాటికలు రాసిన డా.కాసర్లను అభినందించారు. ఈ సభకు తెలంగాణ సారస్వతపరిషత్ అధ్యక్షులు ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో పరిషత్ ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్, మణికొండ వేదకుమార్, గరిపల్లి అశోక్, రాష్ట్రంలోని బాలసాహిత్యవేత్తలు, సేవకులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సభను బాలసాహిత్య కేంద్రసాహిత్య అకాడమి అవార్డు గ్రహీత డా.పత్తిపాక మోహన్ నిర్వహించారు. నిజామాబాద్ నుండి ప్రవీణ్ కుమార్ శర్మ, జె.శ్రీనివాస్ , యం.మంజుల, బాలసాహిత్య పరిశోధకులు సురేందర్ డా.కాసర్ల ను అభినందించారు.

ముప్కాల్ వాసికి పరుగు పందెంలో గోల్డ్ మెడల్


శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న పూసలసంఘం సభ్యులు

నవతెలంగాణ-ముప్కాల్/కంఠేశ్వర్

5వ నేషనల్ మాస్టర్ గేమ్స్ హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన 200 మీటర్ల పరుగు పందెం పోటీల్లో నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన అవాలా శ్రీకాంత్ గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌ను మండల కేంద్రానికి చెందిన వైష్ణవి పూసల సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో మరిన్ని పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొమ్ముల శ్రీనివాస్, పూసల సంఘ సభ్యులు పన్నీరు శ్రీనివాస్, శ్రీధర్, పోశెట్టి, శ్యామ్, చందు, రాజు, లక్ష్మణ్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్: 5వ రాష్ట్రస్థాయి ఆల్ ఇండియా మాస్టర్ గేమ్స్ ఛాంపియన్షిప్-పరుగుపందెం పోటీల్లో వ్యాయామ ఉపాధ్యాయుడైన ఏ.శ్రీకాంత్ బంగారు పతకాలు సాధించాడని విజయ్‌హైస్కూల్ కరస్పాండెంట్ ప్రభాదేవి తెలిపారు. శ్రీకాంత్‌ను పాఠశాల కార్యదర్శి డా. అమృతలత, కరస్పాండెంట్ వి.ప్రభాదేవి, అకడమిక్ డైరెక్టర్ టి.వసంత, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ పి.సుజాత, ప్రిన్సిపాల్ పి.విజేత ప్రత్యేకంగా అభినందించారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- **రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ హుందాన్**


తాహెర్‌ను సన్మానిస్తున్న మండల నాయకులు

నవతెలంగాణ-కోటగిరి

దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తాహెర్‌బిన్ హుందాన్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో మాట - మంతిలో భాగంగా సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షాహిద్, రాష్ట్ర నాయకులు కోటగిరి ఎంపీటీసీ కొట్టం మనోహర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాజేశ్వర్ పటేల్ తాహెర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా తాహెర్‌బిన్ హుందాన్ మాట్లాడుతూ.. ఎన్నో బహుళార్థ సాధక ప్రాజెక్టులు నిర్మించిన ఘనత జవహర్‌లాల్ నెహ్రూదని, ఆయన ముందుచూపు దేశానికి దార్శనికమని అన్నారు. ఆ బాటలో రాహుల్ గాంధీ కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు పాదయాత్ర నిర్వహించి స్థానిక స్థితిగతులు తెలుసుకున్నారని అన్నారు. రాబోయే కాలంలో కాంగ్రెస్ పార్టీ అఖండ విజయం సాధించి అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కాయపల్లి లక్ష్మణ్, ఆయూబ్, కర్ణె వీరయ్య, అనంత్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మంగారి కల్యాణం

జాతర,అన్నదానం


కల్యాణంలో పాల్గొన్న జంటలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్ర శివారులోని శ్రీగిరి గుట్టపై గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీమద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. ఉదయం వీర బ్రహ్మేంద్ర స్వామి, గోవిందమ్మల కళ్యాణోత్సవం కన్నుల పండుగల జరిగింది. అంతకు ముందు గ్రామంలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామీ ఆలయం నుండి బ్రహ్మంగారి ఆలయం వరకు ఉత్సవ విగ్రహలను ఊరేగించారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జాతర సందర్భంగా గుట్టపై తినుబండరాల దుకాణాలు,చిన్నారుల కోసం బొమ్మల దుకాణాలు వెలిశాయి. రాత్రికి గ్రామంలోని నరసింహ స్వామి ఆలయం నుండి శ్రీగిరి గుట్ట వరకు రథోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జాతర పురస్కరించుకొని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షురాలు లోలపు గౌతమి, సర్పంచ్ గడ్డం స్వామి, ఎంపిటసీ సభ్యుడు మైలారం సుధాకర్, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బద్దం రాజేష్ , ఉపాధ్యాక్షులు నూకల మల్లేష్ యాదవ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాల అభివృద్ధికి పనిచేయాలి

- **తెలంగాణ ఎస్సీ బేడ బుడగ జంగాల హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షులు చింతల రాజలింగం**
- **నిజామాబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కడమంచి సాయమ్మ**

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

తెలంగాణ ఎస్సీ బేడ బుడగ జంగాల హక్కుల దండు నిజాంబాద్ జిల్లా మహిళా అధ్యక్షురాలిగా కడమంచి సాయమ్మను నియమించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు చింతల రాజలింగం తెలిపారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన కడమంచి సాయమ్మకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అడుగుజాలాల్లో నడుస్తూ బేడ బుడగ జంగాలను సమీకరించి వారిని చైతన్య పరుస్తూ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎస్సీ బేడ బుడగ జంగాల హక్కుల దండు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనసముందర్ గ్రామానికి చెందిన గమ్మత్తుల రత్నాకర్ కుటుంబ సభ్యులను ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రత్నాకర్ మరణించారు. ఇంటికి పెద్ద దిక్కు మరణించిన విషయం తెలుసుకున్న సునీల్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు. మృతుడు రత్నాకర్ కూతురు పై చదువుల రిత్యా రూ.25 వేలు ఆమె పేరు మీద డిపాజిట్ చేస్తానని కుటుంబ సభ్యులకు తెలిపారు. భవిష్యత్తులో వారి కుటుంబాన్ని ఆదుకుంటానని తెలిపారు. ఆయన వెంట సునీల్ సేన సభ్యులు పాలే పు నర్సయ్య, తదితరులు ఉన్నారు.

మంత్రి కృషితో గ్రామాలకు మహర్దశ

- **ప్రారంభానికి సిద్ధమైన పంచాయతీ, ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు**



ముస్తాబైన పంచాయతీ కార్యాలయం


ప్రారంభానికి సిద్ధమైన ఆరోగ్య ఉపకేంద్రం

నవతెలంగాణ-ఏర్గట్ల

బాల్కొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న మంత్రి ప్రశాంత్ రెడ్డి అవసరం నిమిత్తం తమ గ్రామానికి ఇది కావాలని ప్రజల పక్షంగా నాయకులు అడిగిందే ఆలస్యం వెంటనే పనులను మంజూరు చేస్తూ ప్రజా నాయకుడిగా అందరి మన్ననలు పొందుతున్నారని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. ఏర్గట్ల మండలా భివృద్ధిలో భాగంగా సంక్షేమ పథకాలను, ప్రజలకు అవసరమైన పనులన్నింటిని అమలు చేస్తూ ఆయన ముందుకు సాగుతున్నట్టుతెలిపారు. ఏర్గట్ల మండల కేంద్రంలో నూతన జీపీ భవనం కావాలని సర్పంచ్ గుల్లె లావణ్య గంగాధర్ అడిగిన వెంటనే 20 లక్షల నిధులను మంజూరు చేయించారు. అయితే ఈ నిధులకు సుమారు మరో 30 లక్షల గ్రామ పంచా యతీ నిధులను కలుపుకొని సమావేశ భవనం నాలుగు నెలల కాలంలో నిర్మించి ప్రారంభానికి సిద్ధం చేశారు. తాళ్ళ రాంపూర్ గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ లేకపోవడంతో బాలింతలకు, గర్భిణులకు, సాధారణ వైద్యసేవల కోసం గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారని మంత్రి దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి స్పందించి తాళ్ళ రాంపూర్ సబ్ సెంటర్‌కు 11,73,569 రూపాయలను మంజూరు చేశారు. హెల్త్ సబ్ సెంటర్ నిర్మాణం పూర్తయింది. ఈ సందర్భంగా ఏర్గట్ల, తాళ్ళ రాంపూర్ నాయకులు మాట్లాడుతూ... ఏర్గట్ల నూతన గ్రామపంచాయతీ భవనం, తాళ్ళ రాంపూర్ హెల్త్ సబ్ సెంటర్లు తమంత్రి ప్రశాంత్ రెడ్డి చొరవతో నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మంత్రి అతి త్వరలో వీటిని ప్రారంభిస్తారని అన్నారు.